## కార్వాన్ సర్కిల్ ఏఎంవోహెచ్‌కు సన్మానం


ఇర్షద్ ఇక్బాల్‌ను సన్మానిస్తున్న మురళీచక్రవర్తి తదితరులు

గోల్కొండ: ఓపెన్ పాయింట్లలోని చెత్తను ఎప్పటికప్పుడు తొలగించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని కార్వాన్ నియోజకవర్గం ఏఎంవోహెచ్ ఇర్షద్ ఇక్బాల్ అన్నారు. నూతన ఏఎంవోహెచ్‌గా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ ఈర్షద్ ఇక్బాల్‌ను శనివారం హెచ్‌ఐఎంఎస్‌డబ్ల్యూ కార్వాన్ సర్కిల్ ఇన్‌చార్జి మురళీచక్రవర్తి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఇర్షద్ ఇక్బాల్ మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో చెత్త పేరుకుపోకుండా చూడాలని, ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు హెచ్‌ఐఎంహెచ్‌డబ్ల్యూ సిబ్బంది పూర్తి సహకారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో వార్డు సూపర్‌వైజర్లు తోకటి వినోద్‌కుమార్, శ్రీనివాస్, ఉమేష్, శ్రావణ్, యాదగిరి, ముజీబ్ తదితరులున్నారు.

## దివ్యాంగుల్లో ఆత్మస్థైర్యం ఎక్కువ


ఐజీ సత్యనారాయణకు లోగో అందిస్తున్న జాహెద్

గోల్కొండ: దివ్యాంగుల్లో ఆత్మస్థైర్యం ఎక్కువ అని, ఏపనినైనా సాధించగలుగుతామన్న ధైర్యం ఎక్కువగా ఉంటుందని మల్టీజోన్–11 ఐజీ వి.సత్యనారాయణ అన్నారు. గ్రేటర్ పోలీసు హ్యాండిక్యాప్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు, దివ్యాంగుడైన మహ్మద్ జాహెద్ ఆలీ శనివారం ఆయనను కలిశారు. వృత్తిరీత్యా ఫ్యాషన్ డిజైనర్ అయిన జాహెద్ ఆలీ తాను రూపొందించిన పోలీసు లోగోను ఆయనకు అందించారు. పశ్చిమ మండలం డీసీపీగా పనిచేస్తున్నప్పుడు మహ్మద్ జాహెద్ అలీని కలిశానన్నారు. అతడి పని తీరు ఆత్మస్థైర్యం తనకు ఎంతో నచ్చిందని ఆయన అన్నారు. దివ్యాంగులకు జాహెద్ అలీ ఒక స్ఫూర్తి లాంటివాడని పేర్కొన్నారు.

## 4న క్లాస్-4 ఉద్యోగుల కార్యవర్గ సమావేశం

నాంపల్లి: తెలంగాణ నాల్గవ తరగతి ఉద్యోగుల కేంద్రం సంఘం రాష్ట్ర స్థాయి కార్యవర్గ సమావేశం సెప్టెంబర్ 4న ఉదయం 10.30 గంటలకు జరుగుతుందని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొండూరు గంగాధర్ అన్నారు. ఈ మేరకు ఆయన శనివారం మీడియాతో మాట్లాడుతూ కార్యవర్గ సమావేశం వివరాలను వెల్లడించారు. రాష్ట్ర అధ్యక్షుడు గడ్డం జ్ఞానేశ్వర్ అధ్యక్షతన సమావేశం ఉంటుందని, 33 జిల్లాల అధ్యక్షకార్యదర్శులు హాజరవుతారని వివరించారు. నాల్గవ తరగతి ఉద్యోగుల సమస్యలు, సభ్యత్వ నమోదు, విభజనలో ఏపీకి కేటాయించిన ఉద్యోగులను స్వరాష్ట్రానికి తీసుకురావడం వంటి సమస్యలపై చర్చించనున్నట్లు తెలిపారు. కార్యవర్గ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలపై తీర్మానం చేసి ప్రభుత్వానికి నివేదికను అందజేస్తామని తెలిపారు.

## 'బాడీ బిల్డింగ్'లో సందీప్‌రాజ్‌కు మూడు గోల్డ్‌మెడల్స్


పతకాలతో సందీప్‌రాజ్

అబిడ్స్: బాడీబిల్డింగ్ కాంపిటీషన్‌లో దారుసలాం ఓంనగర్‌వాసి సందీప్‌రాజ్ సత్తా చాటారు. శంషాబాద్‌లో జరిగిన ఐసీఎన్, న్యాచురల్ బాడీబిల్డింగ్ కాంపిటీషన్‌లో మూడు గోల్డ్‌మెడల్స్ సాధించారు. 5 కేటగిరీల్లో పోటీలు నిర్వహించగా సందీప్ రాజ్ మూడు విభాగాల్లో గోల్డ్ మెడల్స్ సాధించారు. ఈ సందర్భంగా ఓంనగర్‌లోని ఆయన నివాసంలో నియోజకవర్గానికి చెందిన పలువురు నాయకులు, స్థానికులు ఆయనను అభినందించారు. అనంతరం సందీప్‌రాజ్ మాట్లాడుతూ కోచ్ మహేష్‌గిరి శిక్షణలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించేందుకు కృషి చేస్తానన్నారు.

## ఆకట్టుకుంటున్న విగ్రహాలు


పురపాలక శాఖ డైరెక్టర్ కార్యాలయం ఎదుట సఫాయి కర్మచారుల విగ్రహాలు

నాంపల్లి: రెడ్‌హిల్స్ డివిజన్‌లోని ఏసీ గార్డ్స్‌లో ఉన్న రాష్ట్ర పురపాలక శాఖ సంచాలకుల కార్యాలయంలో సఫాయి కర్మచారుల విగ్రహాలు చూపరులను ఆకట్టుకుంటున్నాయి. సఫాయి అన్న సలాం ... సఫాయి అమ్మ సలాం... అంటూ విగ్రహాలను ఎంతో అపురూపంగా తీర్చిదిద్దారు. ఈ విగ్రహాలను ఎవరూ ప్రతిష్ఠించారో తెలియదు దగ్గరకు వెళ్లి చూస్తే కానీ ఇవి విగ్రహాలో.. మనుషులో తెలియని పరిస్థితి.

## స్కేటింగ్ రింగ్‌ను నిర్మించండి


కూలిన ప్రహరీని చూపుతున్న క్రీడాకారులు, తల్లిదండ్రులు

గన్‌ఫౌండ్రీ: ఇటీవల కురిసిన వర్షాలకు ఎల్బీస్టేడియంలోని స్కేటింగ్ మైదానం పక్కన కూలిన ప్రహరీని తిరిగి నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వానికి స్కేటింగ్ క్రీడాకారులు, పలువురు తల్లిదండ్రులు విజ్ఞప్తి చేశారు. శనివారం వారు కూలిన ప్రహరీని పరిశీలించారు. ఎల్బీస్టేడియం టెన్నిస్ కోర్ట్ పక్కన స్కేటింగ్ రింగ్ నిర్మాణం కోసం 2019లో అప్పటి ప్రభుత్వం రూ.38 లక్షలు కేటాయించిందని, వాటితో స్కేటింగ్ రింగ్, ప్రహరీ నిర్మించాలని విజ్ఞప్తి చేశారు.

# పేరుకే హైవే..!


100 ఫీట్ల జాతీయ రహదారి

జియాగూడ: పురానాపూల్ నుంచి రాంసింగ్‌పురా వరకు గల వంద ఫీట్ల జాతీయ రహదారి పేరుకే. కానీ, సమస్యలు మాత్రం కోకొల్లలు. పురానాపూల్ దిగువ నుండి గల ఈ మార్గంలో ముందుగా గొర్రె మేకల విక్రయాలు రోడ్డుపైనే కొనసాగుతుంటాయి. హనుమాన్ దేవాలయం వద్ద నుండి యూ టర్న్ జియాగూడకు చిన్నగా ఉండటంతో తరచూ ప్రమాదాలు, నిర్మానుష్య ప్రాంతంలో మద్యం విక్రయాలు సాగుతున్నాయి. కేశవస్వామినగర్ ప్రాంతంలో చెత్త గ్రేడింగ్‌తో రహదారి చెత్తమయం దుర్గంధం, దుర్వాసనలు, రోడ్డుపైనే సంచులకొద్దీ చెత్త బ్యాగులు, జీహెచ్‌ఎంసీ చెత్త ట్రక్కుల పార్కింగ్, డంపింగ్‌యార్డ్ వద్ద చెత్త, మురుగునీరు, మేకలమండి వద్ద అక్రమ పార్కింగ్, రోడ్డుపైనే జీవాల విడి భాగాల విక్రయాలతో కంపు కంపుగా మారింది. అయినా ట్రాఫిక్, పోలీస్ సిబ్బంది, జీహెచ్‌ఎంసీ ఏ మాత్రం చర్యలు తీసుకోవడంలేదు. ఇప్పటికైనా అధికారులు పట్టించుకోవాలని వాహనదారులు, ప్రయాణికులు, స్థానికులు కోరుతున్నారు. అలాగే రోడ్డుపై సంవత్సరాల నుండి కొనసాగుతున్న పైప్‌లైన్ అభివృద్ధి పనులు ఓ పాటికి పూర్తి కావడం లేదు. దీనివల్ల కూడా తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి.


రహదారిలో చెత్త బ్యాగ్స్


మేకల మండి వద్ద రోడ్డుపైనే వాహనాలు నిలిపిన దృశ్యం

## 26న శోభాయాత్ర

అఫ్జల్‌గంజ్: ఈ నెల 26న శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకొని శ్రీకృష్ణ శోభాయాత్ర నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని భాగ్యనగర్ శ్రీకృష్ణ జన్మాష్టమి ఉత్సవ సమితి ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శోభాయాత్ర ఈ నెల 26న సాయంత్రం 6 గంటలకు గౌలిగూడలోని చారిత్రాత్మక జంగల్ విఠోభా దేవాలయం నుండి ప్రారంభించి గౌలిగూడ చమన్, ఉస్మాన్‌షాహిల మీదుగా జాంబాగ్‌లోని యాదవ్ సంఘం వరకు కొనసాగుతుందని తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని పిలుపునిచ్చారు.

## నేడు ఎస్సీ సంఘం సమావేశం

గౌలిపురా: గౌలిపురా అంబికానగర్‌లోని శ్రీశ్రీ మైసమ్మ దేవాలయం సమీపంలో గ్రౌండ్‌లో ఈ నెల 25వ తేదీన షెడ్యూల్డ్ క్యాస్ట్ సంక్షేమ సంఘం అంబికానగర్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించనున్నట్లు షెడ్యూల్డ్ క్యాస్ట్స్ సంక్షేమ సంఘం అంబికానగర్ ప్రధాన కార్యదర్శి రాజపాగ అర్జున్ తెలిపారు. ఇటీవల సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణపై ఇచ్చిన తీర్పుపై మాదిగ, ఉపకులాలు హక్కులను సక్రమంగా వినియోగించేకులా ఈ సమావేశం ఉంటుందన్నారు.

## ప్రభుత్వ కాలేజీల్లో ఉత్తమ బోధన

- కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్


ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందిస్తున్న గోల్కొండ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీలక్ష్మి

గోల్కొండ: ప్రభుత్వ కళాశాలలు ఉత్తమ బోధనకు నిలయాలన్న విషయాన్ని ప్రజల్లో బాగా ప్రచారం చేయాని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. గోల్కొండలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ టి.శ్రీలక్ష్మి శనివారం ఎమ్మెల్యేను కలిశారు. ఈ సందర్భంగా ఆమె సహచర అధ్యాపకులతో కలిసి ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సుదీర్ఘ అనుభవం ఉన్న అధ్యాపకులు కేవలం ప్రభుత్వ కళాశాలల్లోనే ఉంటారన్నారు. గోల్కొండ మహిళా డిగ్రీ కళాశాలను అత్యుత్తమంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని, కళాశాల అభివృద్ధికి తన అండదండలు ఎప్పుడూ ఉంటాయని అన్నారు. ఖాళీగా ఉన్న అధ్యాపకుల పోస్టుల భర్తీ కోసం విద్యాశాఖ ఉన్నతాధికారులను కలిశానని చెప్పారు. కార్యక్రమంలో అధ్యాపకులతో పాటు మజ్లిస్ నాయకులు అలీముద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## జీహెచ్‌ఎంసీలో ఆ అధికారులపై చర్యలు తీసుకోండి


సమావేశంలో మాట్లాడుతున్న ఆనంద్‌కుమార్ గౌడ్

అబిడ్స్: జీహెచ్‌ఎంసీ ఎస్టేట్ విభాగంలో కొంతమంది అధికారులు ఎలాంటి ప్రకటన, టెండర్లు లేకుండా పాతరేట్లకే దుకాణాలు కేటాయించారని ఆయా అధికారులపై చర్యలు తీసుకోవాలని గోషామహల్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ నాయకుడు ఎం.ఆనంద్ కుమార్ గౌడ్ డిమాండ్ చేశారు. గత 8 నెలల క్రితం కోఠి కామత్ హోటల్ పక్కల ఉన్న 14 షాపులకు ఎలాంటి టెండర్లు లేండానే పాత ధరలకే అప్పగించారన్నారు. శనివారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో పలుసార్లు జీహెచ్‌ఎంసీ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా ఇంతవరకు చర్యలు తీసుకోలేదన్నారు. అవినీతి, అక్రమ అధికారులపై విచారణ జరిపితే వాస్తవాలు బయటకు వస్తాయన్నారు. గౌలిగూడ బస్‌డిపో వద్ద షాపుల కేటాయింపులో కూడా అవకతవకలు జరిగాయని పేర్కొన్నారు. వెంటనే కమిషనర్ విచారణ జరిపి అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీఆర్‌ఎస్ నాయకుడు అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌లో న్యాయవాదుల చేరిక


కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న న్యాయవాదులు

అబిడ్స్: కాంగ్రెస్ పార్టీలో పెద్ద ఎత్తున న్యాయవాదులు పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. కిషన్‌రాజ్ చౌహాన్, పొన్నం అశోక్‌కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో పలు న్యాయస్థానాలకు చెందిన న్యాయవాదులు కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా పొన్నం అశోక్‌గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో న్యాయవాదులకు అన్నివిధాలా సహకారాలు అందిస్తామన్నారు. వీరి చేరికతో కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ మరింత బలోపేతమవుతుందని పేర్కొన్నారు.

## 27న సంపూర్ణ భగవద్గీత పారాయణం

సంతోష్‌నగర్: సంతోష్‌నగర్‌లోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో ఈ నెల 27వ తేదీన ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సంపూర్ణ శ్రీమద్ భగవద్గీత పారాయణం మహా వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. చంపాపేట్ కవిత భగవద్గీత బృందం ఆధ్వర్యంలో 100 మంది మహిళతో సంపూర్ణ శ్రీమద్ భగవద్గీత పారాయణం నిర్వహించనున్నామన్నారు. మహిళందరూ ఎరుపు రంగు చీరలు ధరించి తప్పకుండా హజరు కావాలన్నారు. సాయంత్రం 50 మంది బాల బాలికతో నృత్య కార్యక్రమాలు, సూర్యప్రభ, రమాదేవి బృందం ఆధ్వర్యంలో భక్తి సంగీత విభావరి ఉంటుందన్నారు. శ్రీవారి శాంతి కల్యాణం, శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను పెద్ద ఎత్తున నిర్వహించనున్నామన్నారు.

## ఆకట్టుకున్న రాధాకృష్ణుల వేషధారణలు


ఇంద్రాణి మహా విద్యాలయంలో ఉట్టికొడుతున్న చిన్నికృష్ణులు


కాకతీయ స్కూల్ వేడుకల్లో ప్రిన్సిపాల్ వికాస్ చంద్ర

జియాగూడ: జియాగూడ డోర్‌బస్తీలో గల ఇంద్రాణి మహావిద్యాలయలో శనివారం గోకులాష్టమి వేడుకలను ప్రిన్సిపాల్, కరస్పాండెంట్ మిథిలేష్ కుమార్, దివ్యజ్యోతి ఆధ్వర్యంలో నిర్వహించారు. చిన్నారులు రాధాకృష్ణుల వేషధారణలు వేసి ఉట్టికొట్టి సంబరాలు నిర్వహించారు. జియాగూడ కాకతీయ స్కూల్‌లో ప్రిన్సిపాల్ వి.వికాస్‌చంద్ర ఆధ్వర్యంలో గోకులాష్టమి వేడుకలను నిర్వహించారు. చిన్నారులు వివిధ వేషధారణల్లో ఆకట్టుకున్నారు.

## ఓపెన్ పాయింట్ల వద్ద చెత్త వేయొద్దు


హకీంపేట్ అహ్మదీయ మసీద్ వద్ద చెత్త వేయవద్దని ప్రజలకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

గోల్కొండ: ప్రజా నివాసాల్లో ఉన్న ఓపెన్ పాయింట్లను పూర్తిగా ఎలిమినేట్ చేసేందుకు జీహెచ్‌ఎంసీ అధికారులు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా శనివారం జీహెచ్‌ఎంసీ, రామ్‌కీ సిబ్బంది నానల్‌నగర్ డివిజన్ హకీంపేట్‌లోని మసీద్ వద్ద ఉన్న ఓపెన్ పాయింట్‌ను ఎలిమినేట్ చేశారు. ఈ ప్రాంతంలో చెత్త వేయవద్దని బ్యానర్లను ఏర్పాటు చేసి పాయింట్ వద్ద ముగ్గులు, మొక్కలను ఏర్పాటు చేయించారు. మజ్లిస్ నేత మహ్మద్ ముజీబ్‌తో కలిసి స్థానికులకు చెత్త వేయకుండా అవగాహన కల్పించారు. ప్రార్థనా స్థలాల వద్ద ఓపెన్ పాయింట్లు ఉండటంతో అక్కడికి వచ్చేవారు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో శానిటేషన్ ఎస్ఎఫ్ఏ రాకేష్, రామ్‌కీ సూపర్‌వైజర్ వినోద్‌కుమార్, నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## అవార్డులు బాధ్యతలను పెంచుతాయి


మంత్రి పొన్నం ప్రభాకర్, ఎండీ వీసీ సజ్జనార్‌ల చేతుల మీదుగా అవార్డును అందుకున్న కృష్ణారెడ్డి

అఫ్జల్‌గంజ్: పనిచేస్తున్న సంస్థలో తమ కష్టాన్ని గుర్తించి అవార్డులు ఇవ్వడం తమ బాధ్యతలను మరింత పెంచుతాయని టీజీఆర్టీసీ హైదరాబాద డిపో-1 మేనేజర్ బి.కృష్ణారెడ్డి అన్నారు. ఈ మేరకు శనివారం ఆర్టీసీ కళాభవన్‌లో సంస్థలో ఉత్తమ పనితీరు ప్రదర్శించిన అధికారులు, ఉద్యోగులను ప్రగతి చక్రం అవార్డులతో సత్కరించారు. ఈ సందర్భంగా డిపో 1 మేనేజర్ బి.కృష్ణారెడ్డి రోల్ ఆఫ్ హానర్ అవార్డుతో పాటు రాష్ట్ర స్థాయి ఉత్తమ డిపో మేనేజర్ అవార్డులను రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్‌లు అందజేశారు.

## బడ్జెట్‌లో విద్యకు ప్రాధాన్యమివ్వాలి

- అఖిల భారత విద్యాసంఘాల సమాఖ్య కార్యవర్గం


సమావేశంలో మాట్లాడుతున్న సుధీర్‌కుమార్

గన్‌ఫౌండ్రీ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్‌లో విద్యా రంగానికి ప్రాధాన్యతకల్పించాలని అఖిల భారత విద్యాసంఘాల సమాఖ్య కోరింది. శనివారం అబిడ్స్‌లోని స్టాన్లీ ఇంజనీరింగ్ కళాశాలలో ఆ సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సమాఖ్య జాతీయ అధ్యక్షుడు సుధీర్‌కుమార్ మాట్లాడుతూ దేశానికి స్వతంత్ర్యం వచ్చి 77 సంవత్సరాలు అవుతున్నప్పటికీ ప్రభుత్వాలు ఇంకా సరైనా విద్యారంగ సంస్కరణలు, పాలసీలను రూపొందించలేకపోతున్నాయని, విద్యారంగ సమస్యలను పరిష్కరించలేకపోతున్నాయని అన్నారు. అనేకమంది బాలబాలికలు బడిబయట బాలకార్మికులుగా ఉంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ విద్యారంగాన్ని చిన్నచూపు చూస్తూ ప్రైవేటు విద్యావ్యాపారానికి పాలకులు పరోక్షంగా సహకరిస్తున్నారని ఆరోపించారు. విద్యా వ్యాపారాన్ని అరికట్టాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సమాఖ్య ప్రధాన కార్యదర్శి ప్రభుకుమార్, సంధ్యప్రధాన్(జార్ఖండ్), కమల్ లోచన్(ఒడిశా), కావలి అశోక్‌కుమార్(తెలంగాణ), జి.ఉదయ్‌రాజు(ఏపీ)లతోపాటు పలు రాష్ట్రాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## దివ్యాంగుల క్రీడలకు సముచిత ప్రాధాన్యం

- ప్రభుత్వ సలహాదారు జితేందర్‌రెడ్డి


దివ్యాంగ క్రీడాకారులకు అవార్డులను అందజేస్తున్న జితేందర్‌రెడ్డి, శివసేనారెడ్డి

గన్‌ఫౌండ్రీ: రాష్ట్ర ప్రభుత్వం క్రీడారంగ అభివృద్ధికి కృషి చేస్తుందని ప్రభుత్వ సలహాదారు జితేందర్‌రెడ్డి తెలిపారు. శనివారం రవీంద్రభారతిలో రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో క్రికెట్ అసోసియేషన్ ఫర్ ది బ్లైండ్ ఇన్ తెలంగాణ సంస్థ ఆధ్వర్యంలో జాతీయ క్రీడా దినోత్సవాలను నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం త్వరలో సరికొత్త క్రీడాపాలసీని తీసుకురాబోతున్నట్లు తెలిపారు. స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ కె.శివసేనారెడ్డి మాట్లాడుతూ దివ్యాంగుల క్రీడలకు సముచిత ప్రాధాన్యతను ఇవ్వనున్నట్లు తెలియజేశారు. అనంతరం అంతర్జాతీయ అంధ క్రికెట్ క్రీడాకారులు మధు, మాధవ్‌లను ఘనంగా సన్మానించారు. వివిధ క్రీడల్లో రాణిస్తున్న దివ్యాంగ క్రీడాకారులకు అవార్డులు అందజేశారు. కార్యక్రమంలో వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య, సినీనటుడు తనికెళ్ల భరణి, సరస్వతి ఉపాసకులు దైవాజ్ఞశర్మ, సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ సీహెచ్ హరీష్‌కుమార్, కార్యదర్శి కె.అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు డెంగీ, మలేరియాపై అవగాహన

రాజేంద్రనగర్: మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ శాంతినగర్ కాలనీలో శనివారం ప్రజలకు డెంగీ, మలేరియా కేసులపై మలేరియా అధికారి డాక్టర్ రాకేష్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి తిరుగుతూ.. ఇంటి పరిసరాల్లో ఉన్న నీటితొట్లు, పూలకుండీలను పారవేయించి కాలనీల్లోని ఇంటి పరిసరాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రజలందరూ సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. హెల్త్ ఆఫీసర్ చెన్న కేశవ్, ఎస్‌యుడీ నారాయణ, పాల్గొన్నారు.

## అభినందన

అఫ్జల్‌గంజ్: గ్రేటర్ హైదరాబాద్ యాదవ సంఘం జాయింట్ అభివృద్ధికి శక్తివంచనం లేకుండా కృషి చేస్తానని ఆ సంఘం నూతన అధ్యక్షుడిగా నియమితులైన బోయిని వెంకటేష్ యాదవ్ అన్నారు. ఈ మేరకు శనివారం ఉస్మాన్‌షాహిలోని ఆయన నివాసంలో బేగం బజార్ డివిజన్ బీజేపీ యువజన నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అరుణ్‌సింగ్, రమేష్ వ్యాకర్, శక్తి సింగ్, ఆశిష్ వ్యాస్ చెనారామ్, రాహుల్, శివ, ఆశిష్ వాగ్మారే, పవన్ షిండే, విజయ, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.


బోయిని వెంకటేష్ యాదవ్‌ను సన్మానించిన బీజేపీ నాయకులు

## పోగొట్టుకున్న సెల్‌ఫోన్లు తిరిగి అందజేత

సంతోష్‌నగర్: ఐ.ఎస్.సదన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో వివిధ సందర్భాల్లో పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను సీఈఐఆర్ పోర్టల్ ద్వారా గుర్తించి శనివారం ఇన్‌స్పెక్టర్ ఎం.వెంకట్రామయ్య ఆధ్వర్యంలో బాధితులకు అందజేశారు. సెల్‌ఫోన్లు పోయాయని ఐదుగురు బాధితులు ఇదివరకు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు వాటిని సీఆర్ఐఆర్ పోర్టల్ ద్వారా గుర్తించి బాధితులకు అందజేశారు. దీంతో వారు పోలీసులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## తీసుకున్న డబ్బును వడ్డీతో చెల్లించాల్సిందే..

- డుప్లెక్స్ నిర్మాణానికి డబ్బు తీసుకొని మోసగించిన రియల్ ఎస్టేట్ సంస్థ
- గురు రాఘవేంద్ర ఇన్‌ఫ్రా కంపెనీపై బాధితుడి ఫిర్యాదు
- 30 రోజుల్లో మొత్తం డబ్బు చెల్లించాలని వినియోగదారుల కమిషన్ తీర్పు

సిటీ, కోర్టులు: విల్లా నిర్మాణం కోసం డబ్బులు తీసుకొని ఒప్పందం ఉల్లంఘించి బాధితుడిని ఇబ్బంది పెడుతున్న ఓ రియల్ ఎస్టేట్ సంస్థపై రాష్ట్ర వినియోగదారుల కమిషన్ మొట్టికాయలు వేసింది. వివరాల్లోకి వెళితే.. గురురాఘవేంద్ర ఇన్ఫ్రా డెవలపర్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్‌గా మంచికంటి చంద్రమౌళి వ్యవహరిస్తున్నారు. రంగారెడ్డి జిల్లా కుత్బుల్లాపూర్, గాజులరామారంలో ప్లాట్లు అమ్మడంతోపాటు అక్కడే డుప్లెక్స్ ఇంటి నిర్మాణం చేసి ఇస్తామని కంపెనీ ఆఫర్ పెట్టింది. దీంతో కుత్బుల్లాపూర్‌కు చెందిన రిటైర్డ్ ఉద్యోగి కటికెల వెంకటయ్య జూన్, 2016లో ఫ్లాట్ నెం.26, 190 గజాల భూమిని కొనుగోలు చేశాడు. జీ ప్లస్ వన్ డుప్లెక్స్ ఇంటి నిర్మాణం కోసం రూ.54 లక్షలకు ఒప్పందం చేసుకున్నారు. అందులో ఏడాదిలోపు నిర్మాణం పూర్తి చేయాలని, ఏడాది దాటినా నిర్మాణం పూర్తికాకపోతే అప్పటి నుంచి నిర్మాణం పూర్తి అయ్యేవరకు ప్రతి నెలా రూ.25 వేల అద్దె చెల్లిస్తామని కంపెనీ హామీ ఇచ్చింది. ఏడాది తర్వాత బాధితుడు అక్కడికి వెళ్లి చూడగా నిర్మాణం ఇంకా పునాది దశలోనే ఉంది. వెంటనే బాధితుడు కంపెనీ యాజమాన్యాన్ని సంప్రదించి పక్కన ఉన్న ప్లాట్ కంటే తమ ప్లాట్‌లో నిర్మాణం సరిగ్గా లేదని, బేస్‌మెంట్ ఎత్తుపెంచాలని కోరారు. మిగతా ఇళ్లలా ఎత్తు ఉండాలంటే మరో రూ.32 లక్షలు చెల్లించాలని కంపెనీ స్పష్టం చేసింది.

### నష్టపరిహారం కూడా ఇవ్వాలి..

అయితే 'మా డబ్బును మాకు వాపసు ఇవ్వండి, లేదా నిర్మాణం పూర్తి చేయండి'అని బాధితుడు అడిగినా కంపెనీ స్పందించలేదు. దీంతో బాధితుడు 2018లో కమిషన్‌ను సంప్రదించాడు. ఈ మేరకు విచారణ చేపట్టిన రాష్ట్ర కమిషన్ అన్ని వివరాలను పరిశీలించింది. బాధితుడి నుంచి తీసుకున్న డబ్బును అగ్రిమెంట్ నుంచి మొదలుకొని కోర్టు ఆర్డర్ వరకు మొత్తాన్ని 9 శాతం వడ్డీతో .50.21 లక్షలను తిరిగి బాధితుడికి చెల్లించాలని కంపెనీని ఆదేశించింది. అంతేకాకుండా రూ.2 లక్షల పరిహారం, ఫిర్యాదుదారుడి ఖర్చులకు రూ.25 వేలను, మొత్తం డబ్బును 30 రోజుల్లోపు చెల్లించాలని కమిషన్ మెంబర్లు కె.రంగారావు, ఆర్.ఎస్. రాజశ్రీ తీర్పులో పేర్కొన్నారు.